క్లుప్తంగా

తీరిన తాగునీటి సమస్య



బోరువేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిలో తాగునీటి సమస్యను సర్పంచ్ పద్మమ్మ పరిష్కరించారు. గ్రామంలో నీరు చాలక గ్రామస్తులు ఇబ్బంది పడుతుండటంతో పంచాయతీ, జెడ్పీ నిధులతో బోరువేసి, మోటారు, బిగించి, పైపులైను వేయించడంతో తాగునీటి సమస్య తొలగింది. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

పీఆర్ ఏఈగా ఇబ్రహీం ఖాన్



సత్యవేడు: మండల పరిషత్ పంచాయతీరాజ్ ఏఈగా ఇబ్రహీం ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల ప్రాజెక్టు ఏఈగా పనిచేస్తూ బదిలీపై సత్యవేడు వచ్చారు. 8ఏళ్లగా ఖాళీగా ఉన్న ఏఈ పోస్టు ఈ ఏడాది భర్తీ అయ్యింది. మండలంలో సిమెంటు రోడ్లు, డ్రైన్లు, గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభ



కంచనపుత్తూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ స్వప్న

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామపంచాయతీలో గురువారం ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న కొత్త పనుల గుర్తింపు కోసం సర్పంచ్ స్వప్న అధ్యక్షతన గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ గ్రామసభ నిర్వహించారు. చెరువుల్లో పూడికతీత, పంట కాలువలకు మరమ్మతులు, నీటి గుంతలు తదితర పనులు చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గ్రామ పంచాయతీకి సంబంధించిన మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. గ్రామంలోని జగనన్న లేఔట్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ సిబ్బంది కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

22 మద్యం షాపులకు టెండర్ల ఆహ్వానం

-ఎక్సైజ్ సీఐ దశరథ రామిరెడ్డి

నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 22 మద్యం షాపులకు సంబంధించి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నోటిఫికేషన్ జారీ చేశారని ఎక్సైజ్ సీఐ దశరథ రామిరెడ్డి తెలిపారు. సత్యవేడు మండలంలో 10, వరదయ్యపాళ్యం 5, నాగలాపురం 4, పిచ్చాటూరు 3 చొప్పున మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందని, ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు నిర్ణీత డిపాజిట్ చెల్లించాలన్నారు. లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయిస్తామని, ఈ విధానంలో షాపు దక్కించుకున్నవారు మండలంలో ఏ ప్రాంతంలో అయినా గుడి, బడి సమీపంలో తప్ప ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మద్యం షాపుల నిమిత్తం అభ్యర్థుల డిపాజిట్ సొమ్ము వాపస్ చేసేది ఉండదన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

యానాదులకు పక్కా గృహాలు మంజూరు చేయరూ!

శ్రీకాళహస్తి: పట్టణంలో వైష్ణవ కోనేరు సమీపంలోని ఈశ్వరయ్యకాలనీ యానాదులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఇప్పటివరకు పింఛన్ల పెంపు తప్పితే మరే ఇతర హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఈశ్వరయ్యకాలనీలో ఇళ్లు నిర్మించి 5 దశాబ్దాలైందని, అవి శిథిలావస్థకు చేరుకోవడంతో యానాదులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈశ్వరయ్య యానాదికాలనీని అభివృద్ధి చేయాలన్నారు. ఇదలా ఉంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పింఛన్ల హామీ తప్పితే మరే ఇతర హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు బస్సు ప్రయాణం..తదితర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశబూరు. కార్యక్రమంలో శ్రీరాములు, శివకుమార్, వైఎస్ మణి, మునిగంగమ్మ, సుబ్బరత్నమ్మ, గోపాల్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి మాజీ చైర్మన్ మృతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ పీజే చంద్రయ్య అస్వస్థతకు గురై గురువారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్వర్ణముఖి నదిలో

పచ్చనేతల సొంత రీచ్‌లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: స్వర్ణముఖి నది అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీలు.. ఆరు టిప్పర్లు అన్న చందంగా ఏ విధమైన అనుమతులు లేని రీచ్‌లు ఏర్పాటు చేసి, అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం, నాయకుల మద్దతు ఉండడంతో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏ అధికారీ ముందుకు రావడం లేదు. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల తగ్గిపోయే ప్రమాదం పొంచిఉంది. గతంలో ఏర్పేడు మండలం మునగలపాళెంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇదే తరహాలో ఇసుక మాఫియా దాహానికి 16 మంది రైతులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తూ లారీ ఢీకొని మరణించిన ఘటన మళ్లీ పునరావృతం అవుతాయేమోనన్నట్లుగా ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడు విరుపాక్షపురం, శ్రీకాళహస్తి మండలంలోని ఏడం, చుక్కలనిడిగల్లు, ఏర్పేడు మండలంలోని ముసలిపేడు, రేణిగుంట మండలంలో గాజులమండ్యం, పాపానాయుడుపేటలో అనధికార రీచ్‌లు మళ్లీ ప్రారంభించారు. ఎటువంటి అనుమతి పత్రాలు తమ వద్ద లేకున్నా వారిష్టంగా వారే రీచ్ తాము పాడామని, తాము ఎలా చెబితే అలా వినాలని ట్రాక్టర్ యజమానులను అధికార పార్టీ నేతలు, అక్రమార్కులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తొట్టంబేడు మండలం పెన్నలపాడులో స్వర్ణముఖిలోకి ఇసుక అక్రమ రవాణా కోసం గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారంటే ఇసుక అక్రమార్కులు ఏ స్థాయిలో దందా చేస్తున్నారో ఇట్టే అర్థం అయిపోతోంది. అనధికారిక రీచ్‌కు రోడ్లు వేస్తున్నా, తమకేమీ తెలియదంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది మైనింగ్ పరిధిలోకి వస్తుందని, వారికి ఫిర్యాదు చేయాలని ఒకసారి, మీరు వెళ్లి ఆపండని మరోసారి ఉచిత సలహాలిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై తొట్టంబేడు తహసీల్దార్ మదనమోహన్‌రావును వివరణ కోరగా దాటవేసే ప్రయత్నం చేశారు. ఇదే విషయాన్ని ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా తాను డిప్యూటీ సీఎం ప్రోగ్రాంలో ఉన్నానని, తొట్టంబేడు తహసీల్దార్‌కు చెప్పానని తెలిపారు. పై అధికారుల సూచనలతో తప్పనిసరైన పరిస్థితుల్లో తహసీల్దార్ మదనమోహన్‌రావు పెన్నలపాడు రీచ్‌లో అక్రమార్కులను అడ్డుకుని, వీఆర్వోతో అక్కడ కాపలా ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు.



పెన్నలపాడు స్వర్ణముఖి వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



ఇసుక జేసీబీలతో ట్రాక్టర్లలోకి నింపుతున్న అక్రమార్కులు



స్వర్ణముఖి నదిలోకి పెన్నలపాడు వద్ద వేసిన రోడ్డు

కార్మికులకు పండుగ బోనస్ ఇవ్వాలి

నారాయణవనం: రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు దీపావళి పండుగ బోనస్‌ను ఇవ్వాలని సమాచార హక్కుల వేదికక ప్రతినిధి మురగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1965లో కేంద్ర ప్రభుత్వ చేసిన చట్టం మేరకు ఉద్యోగులకు, కార్మికులకు దీపావళి బోనస్‌ను యాజమాన్యాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వడం లేదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించాలని, కార్మికులు, ఉద్యోగులకు బోనస్‌ను ఇప్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.

స్నేహమంటే ఇదేరా..!

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి సహచరుల ఆర్థిక సాయం



విద్యార్థిని తల్లి చాముండేశ్వరికి నగదు అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్లు చెంచురెడ్డి, ధనంజయరెడ్డి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం శ్రీసాయి గణేష్ విద్యాలయం విద్యార్థిని బి.తేజశ్వని ఇటీవల తన తండ్రితోపాటు మోటార్‌బైక్‌లో వెళుతూ జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ఆమె కాలు తొలగించారు. సాయిగణేష్ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులంతా కలసి రూ.1.33లక్షలు సమీకరించి ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు యూ.చెంచురెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి చేతుల మీదుగా తేజశ్విని తల్లి చాముండేశ్వరికి నగదు అందజేశారు. విద్యార్థులు ఇలా చేయూతనివ్వడంపై పాఠశాల యాజమాన్యం అభినందించింది.

పంటలకు ఈకేవైసీ తప్పనిసరి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి భారతి కోరారు. గురువారం మండలంలోని పెద్దపాలేడు, కనమనంబేడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఆరు తడి పంటలు సాగు చేయవచ్చని అవగాహన కల్పించారు.

సామాజిక సేవలతో అంజూరు జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు జన్మదినం పురస్కరించుకుని గురువారం పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత మాజీఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహం వద్ద అన్నదానం, పేదలకు దుస్తుల వితరణ చేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు, తొట్టంబేడు మండలం అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. అలాగే వంగవీటి మోహనరంగ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన



వరదయ్యపాళెం జూనియర్ కళాశాలకు వచ్చిన అధికారుల బృందానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల బృందం గురువారం మండలంలో పర్యటించి పరిశీలించింది. స్థానికంగా చెన్నవారి పాళెంకు చెందిన ఎన్టీఆర్ వెంకయ్య ఇటీవల డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో కళాశాలల విద్యా కమిషనర్ ఆదేశాలతో ఆర్జేడీ డాక్టర్ బి.బాబు, శ్రీకాళహస్తి ఎస్వీపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, మరికొందరు విద్యార్థులు వరదయ్యపాళెం జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థుల వివరాలు, జూనియర్ కళాశాల ప్రాంతంలో వసతులు, భవనాల గురించి కళాశాల ప్రిన్సిపల్ పద్మావతితో సమావేశమై తెలుసుకున్నారు. తమ సందర్శనలో గుర్తించిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆర్జేడీ తెలిపారు. కూటమి నాయకులు అధికారుల బృందాన్ని కలిసి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు.

టీ షాపుల్లో మద్యం..!

-దాడులు చేసి స్వాధీనం చేసుకున్న పోలీసులు



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాగలాపురం: మండలంలోని నందనంలో టీ దుకాణాల నిర్వాహకులు గురవయ్య, వెంకటేష్ తమ షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో తన సిబ్బందితో దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సునీల్ కుమార్ గురువారం తెలిపారు. దాడుల్లో ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించరాదని ధర్నా



సత్యవేడులో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

సత్యవేడు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, 4,200 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ సత్యవేడులో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మిలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమేష్, నాగార్జున, మురళి, చిన్నచంద్ర, మురళి, మాణిక్యం, అంబేడ్కర్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు సాదర వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట: మూడు రోజులు తిరుపతి, తిరుమల పర్యటన ముగించుకుని తిరిగి గురువారం రాత్రి 8.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సాదర వీడ్కోలు లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు తదితరులు వీడ్కోలు పలికారు. అంతకు ముందు టెర్మినల్ బయట రేణిగుంట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమకు జీతాలు పెంచి, పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయనకు వినతిపత్రం ఇచ్చారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రి

శ్రీకాళహస్తి : రాబోయే 45 రోజుల్లో ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రకటించారు. గురువారం ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఆస్పత్రిలో పలు సమస్యలు ఉన్నాయని, వాటన్నిటినీ పరిష్కరించాలన్నారు. బాత్రూమ్‌లలో ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాలింతల కోసం ప్రత్యేకంగా 75 బెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వాటర్ ప్లాంట్, పోస్టుమార్టం రూంలో ఫ్రీజర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచండి



కూలీలకు పనులపై అవగాహన కల్పిస్తున్న ఏపీఓ భానుప్రియ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ భానుప్రియ సిబ్బందిని ఆదేశించారు. గురువారం బీయస్‌పురంలో చేస్తున్న ఉపాధి పనులు, కూలీల హాజరును ఆమె పరిశీలించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో 2 వేల మంది కూలీలు పనిచేయవలసి ఉండగా 1,100 మంది మాత్రమే పనిచేస్తున్నారని , కూలీల సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలి గిట్టుబాటు అవుతుందని, ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. పనుల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ



బాలత్రిపుర సుందరిగా కామాక్షాంబిక, మూలస్థాన ఎల్లమ్మ, సత్యవేడులో.., కట్టపుట్టాలమ్మ, పొనగల్ గంగమ్మ, ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ, స్వర్ణ కవచాలంకారంలో..

నారాయణవనం: మండలంలో సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం సాయంత్రం అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. సాయంత్రం 6.30 గంటలకు కలశ స్థాపన చేసి, గణపతి, నవగ్రహ పూజలను నిర్వహించి, ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 7.30 గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తామని, సాయంత్రం అమ్మవారు బాలత్రిపుర సుందరిగా ఉయ్యాలసేవలో దర్శనమిస్తారని ఆలయ అధికారి నాగరాజు, ఆలయ అర్చకులు పన్నీర్‌సెల్వం తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి ఉదయం 8.30 గంటలకు నిర్వహించే అభిషేకంలో భక్తులు రూ 30 చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు. ఇక, కైలాసనాథకోనలో ఉదయం 9 గంటలకు కలశ స్థాపన, హోమాలు, అభిషేకాలను నిర్వహించి, కామాక్షాంబిక అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి, కుంకుమార్చన చేస్తామని ఆలయ అర్చకులు మహేంద్రశర్మ తెలిపారు. తిరువట్యంలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దశరా సందర్భంగా అభిషేకాలు నిర్వహించి, బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. మాజీ సర్పంచ్ భారతి, పురుషోత్తం భక్తులు అన్నప్రసాదాలను అందజేశారు.



బొమ్మల కొలువులో శైలపుత్రిగా జ్ఞానప్రసూనాంబ దేవి విశేషంగా దేవీ నవరాత్రులు

రేణిగుంట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం రేణిగుంట మండలంలో ఘనంగా మొదలయ్యాయి. కరకంబాడిలోని శ్రీ కట్ట పుట్టాలమ్మ ఆలయంలో విశేష అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రోజూ ఒక్కొక్క అవతారంలో తొమ్మిది రోజులు అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, చివరి రోజున కాళికామాత అవతారంతో అలంకరిస్తామని ఆలయ ధర్మకర్త వాసు తెలిపారు. అలాగే రేణిగుంటలోని గంగమ్మ ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, పలు ఆలయాల్లో దేవీ నవరాత్రి పూజలు చేశారు.

బాల త్రిపురసుందరీ దేవిగా రాజరాజేశ్వరి దేవి

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద మాతాశ్రమంలో శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో మొదటి రోజైన గురువారం రాజరాజేశ్వరిదేవి బాలత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పాపానాయుడుపేటలో భద్రకాళీదేవి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి బాలత్రిపురసుందరీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సత్యవేడులో..

సత్యవేడు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక లలితాదేవి ఆలయంలో తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు, ధర్మకర్త రవికుమార్ దేవర్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: పలు అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. గురువారం బాలత్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వరదయ్యపాళెంలోని చెంగాళపరమేశ్వరి, అంబూరు లోని శ్రీకామాక్షమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరుణించు శైలపుత్రీ..!

శ్రీకాళహస్తి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు గురువారం శైలపుత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయం కనకాచలంలోని కనకదుర్గమ్మ ఆలయంలో లో దసరా ఉత్సవాలకు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనకదుర్గమ్మ, బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన జ్ఞానప్రసూనాంబ శైలపుత్రీగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పొనగల్ గంగమ్మ భువనేశ్వరి అలంకారం, బజారువీధిలో కన్యకాపరమేశ్వరి శివపూజ అలంకారం, భాస్కరపేట చాముండేశ్వరి బాలత్రిపుర సుందరిగా, వేడాంలో దక్షిణ కాళికాదేవి ప్రత్యేక అలంకారం, బీపీ అగ్రహారం గంగమ్మ, పొన్నాలమ్మ, త్రిశూలాంబ, సంతమైదానం , అంకాళమ్మ, పీవీరోడ్డు అంకమ్మ ప్రత్యేక అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని ఆలయంలోఊరేగించారు.

పతాకావిష్కరణతో దసరా ఉత్సవాలు ప్రారంభం



పతాకావిష్కరణలో ఆర్య వైశ్యులు

శ్రీకాళహస్తి: స్థానిక బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం పతావిష్కరణతో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ జూలుగంటి మురళి, లోకేశ్వరరావు, అమృతవల్లి, పాలకమండలి సభ్యులు, మహిళా మండలి సభ్యులు, యువసేన సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ కనిపిస్తే తొలగింపు!

- సచివాలయ ఉద్యోగులపై టీడీపీ నేతల ఒత్తిడి



గాంధీజయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ ఎక్కడ కనిపించినా తొలగించాలని సచివాలయ ఉద్యోగులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలు వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను సచివాలయ ఉద్యోగులు, కొంతమంది మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నాయకులు ఫ్లెక్సీల రాజకీయానికి తెరలేపారు. పాలకమండలి మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత అంజూరు తారక శ్రీనివాసులు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. కమిషనరే తొలగించమన్నారని ఓ వైపు సిబ్బంది చెబుతున్నారు. దీనిపై కమిషనర్‌ను ప్రశ్నించగా.. తాను ఎవరికీ ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని చెప్పారు. ఇక, నాలుగు మాడ వీధుల్లో ఎవరూ ఫ్లెక్సీలు పెట్టకూడదని గతంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశించినప్పటికీ కూటమి నాయకులే ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం!